ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 ; కనిష్ఠం 25.3
నిజామాబాద్ జిల్లా వార్తలు
3
బుధవారం 31 జూలై 2024





● రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

అట్టహాసంగా రెండో విడత

● జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన సంబురాలు ● సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

- జిల్లాలో రెండో విడత రుణమాఫీ అమలు
- లక్షన్నర లోపు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- కలెక్టరేట్‌తో పాటు రైతువేదికల్లో ప్రత్యేక కార్యక్రమం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు
- జిల్లా వ్యాప్తంగా 22,868 మంది రైతులకు సంబంధించి రూ. 210.54 కోట్లు మాఫీ
- జిల్లాలో రెండు విడతల్లో కలిపి మొత్తం 67,337 మంది రైతులకు లబ్ధి



కమ్మర్‌పల్లి రైతు వేదిక వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నిజామాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా రెండో విడత లక్షన్నర రైతు రుణమాఫీ నిధుల విడుదల మొదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని కలెక్టరేట్‌తో పాటు అన్ని మండలాల పరిధిలోని 31 రైతువేదికల్లో అట్టహాసంగా కార్యక్రమాలను నిర్వహించారు. రుణమాఫీ అయ్యే రైతుల జాబితాను ప్రకటించడంతో పాటు కొంత మందికి మాఫీ అయినట్లు కార్యక్రమంలో పత్రాలను అందించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ రుణమాఫీలో రెండో విడత కింద జిల్లాలో 210.54 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. లక్షన్నర లోపు ఉన్న రైతుల రుణాలన్నీ మాఫీ చేశారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులతో పాటు కాంగ్రెస్ నేతలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లక్షన్నరలోపు ఉన్న రైతులందరికీ మాఫీ

రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర రూపాయల లోపు ఉన్న రైతుల రుణమాఫీ అమలు మొదలు పెట్టింది. అధికారికంగా శాసనసభ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్త సుకేందర్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఇతర మంత్రుల ఆధ్వర్యంలో నిధులను విడుదల చేశారు. రుణమాఫీ ఎందుకు చేస్తున్నారో ప్రకటించారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఈ రుణమాఫీ కింద లక్షన్నరలోపు రుణం ఉన్న 22,868 మంది రైతులకు 210.54 కోట్ల రూపాయలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. వారి ఖాతాల్లో జమ మొదలు పెట్టారు. ఇప్పటికే మొదటి విడత కింద జిల్లాలో లక్ష రూపాయలలోపు రుణం ఉన్న 44,469 మందికి 225.62 కోట్ల రూపాయలను మాఫీ చేశారు. ఈ రెండు విడతల్లో మొత్తం 436.16 కోట్ల రూపాయలను మాఫీ అయినట్లు ప్రకటించారు. జిల్లాలోని మొత్తం 67,337 మందికి రెండు విడతల్లో ఈ రుణమాఫీ అయినట్లు అధికారులు ప్రకటించారు.

పండుగలా రుణమాఫీ కార్యక్రమం

జిల్లాలో రెండో విడత రుణమాఫీ ప్రక్రియను పండుగలా నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్‌లో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్ని మండలాల నుంచి రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చూశారు. కలెక్టరేట్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్‌తో పాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు, బ్యాంకు, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. రుణమాఫీపై రైతులకు వివరించడంతో పాటు వారికి రుణం మాఫీ అవుతున్నట్లు ప్రకటించారు. లక్షన్నర లోపు రుణం మాఫీ చేయడంతో పాటు మళ్లీ కొత్త రుణాలను అందిస్తున్నట్లు ప్రకటించారు. కార్పొరేషన్ చైర్మన్లతో కలిసి కలెక్టర్ రుణమాఫీకి సంబంధించిన చెక్కులను రైతులకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాల్లో 31వేల కోట్ల రూపాయలను జమ చేస్తుందని కలెక్టర్ ప్రకటించారు. మొదటి విడత కింద ఈనెల 18న లక్ష రూపాయలలోపు రుణం మాఫీ చేయగా, రెండో విడత కింద లక్షన్నర రూపాయల రుణం మాఫీ చేస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని రైతులకు ఈ రుణమాఫీ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు. రుణమాఫీ అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా మాఫీ అమలవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బంది ఉంటే వాటిని పరిష్కరిస్తున్నామని అన్నారు. జిల్లా స్థాయిలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 517 ఫిర్యాదులు రాగా పరిష్కరించినట్లు తెలిపారు. రైతులు నేరుగా ఫిర్యాదు చేసేందుకు రాకుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. రైతులు రుణమాఫీ ద్వారా ప్రయోజనం చేకూర్చడంతో పాటు వారికి కొత్త రుణాలు అందించే విధంగా బ్యాంకు అధికారులు చర్యలు చేపట్టారని అన్నారు. రుణమాఫీ అంతా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తున్నామని అన్నారు.

రైతువేదికల్లో ప్రత్యేక కార్యక్రమాలు


ప్రభుత్వం రెండో విడత చేపట్టిన ఈ రుణమాఫీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 31 రైతువేదికల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సీఎం ప్రసంగాన్ని నేరుగా వీక్షించే విధంగా చూడటంతో పాటు అనంతరం రైతులకు రుణమాఫీ చెక్కులను అందించారు. జిల్లాలో 31 రైతుకేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా రెడో విడత రుణమాఫీ అమలు చేసిన సందర్భంగా సీఎం చిత్రపటాలకు పలు చోట్ల క్షీరాభిషేకాలను నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్, పాపయ్యతో పాటు పలు శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



నిజామాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ వినతి

పెద్దబజార్, జూలై 30: నిజామాబాద్ నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. మంగళవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ.. అసెంబ్లీలో ముఖ్యమంత్రి చాంబర్‌లో రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అర్బన్ నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అర్బన్‌లో రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని నగరంలో తాగునీటి సమస్య, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదిర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. ఎస్‌డీఎఫ్ ఫండ్ 10కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సీఎం వినతిపత్రం అందజేశారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



యథేచ్ఛగా అక్రమ వెంచర్లు!

- జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో అనుమతులు లేకుండా వెంచర్లు
- కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు
- కొన్ని వెంచర్లు, భవనాలకు నోటీసులు జారీ చేసిన అధికారులు

నిజామాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మున్సిపాలిటీల పరిధిలో అక్రమ వెంచర్లు, నిర్మాణాలు ఆగడం లేదు. కొన్ని వెంచర్లు ఎలాంటి నాలా కన్వర్షన్లు చేయకుండానే చేస్తున్నారు. అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా ప్లాట్లు చేసి అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని ప్లాట్లకు అనుమతులు లేకున్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్‌లను చేస్తుండటంతో అధికారులు వాటిని నిలిపివేస్తున్నారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మాణం సమయంలో అనుమతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ముందే అన్నీ అనుమతులు తీసుకొని వెంచర్లు చూసి ప్లాట్లను అమ్మితే ఇబ్బందులు తప్పే అవకాశం ఉన్నా.. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కొన్నవారు సమస్యలను ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కొన్నిచోట్ల అధికారులు పట్టించుకోవడం లేదు. పూర్తిస్థాయి అనుమతులు లేకుండా, నిర్దీత స్థలాలు వదలకుండానే అపార్ట్‌మెంట్లతో పాటు భవనాలు నిర్మాణం చేస్తున్నా పట్టించుకోకపోవడం వల్ల పలుపార్టీల నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. ఏకంగా ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డికి కూడా ఫిర్యాదు చేసి దర్యాప్తు చేయాలని కోరినా కొన్నిచోట్ల పట్టించుకోవడం లేదు. స్థానిక నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

కార్పొరేషన్, మున్సిపాలిటీలలో జోరుగా వెంచర్లు

నిజామాబాద్ నగర కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలో వెంచర్లు ఎక్కువగా వేస్తున్నారు. ప్రైవేటు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వెంచర్లుగా మారుస్తున్నారు. మట్టి, మొరం నింపి ప్లాట్లుగా మారుస్తున్నారు. ఆకర్షణీయంగా బోర్డులను పెట్టి అమ్మకాలను చేపడుతున్నారు. గజం ధరలను నిర్ణయిస్తూ ఎక్కువ మొత్తంలో అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములను వెంచర్లుగా మారిస్తే నాలా కన్వర్షన్ తీసుకోవడంతో పాటు అన్ని అనుమతులు పొందాలి. ఆ వెంచర్‌లో ప్రభుత్వం నిబంధనల ప్రకారం 10శాతం భూమిని వదిలి వేయాలి. రోడ్లు, డ్రైనేజీలకు స్థలం వదిలేసి నిబంధనల మేరకు ప్లాట్లు చేసి అమ్మకాలు చేయాలి. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో భూముల ధరలు భారీగా పెరిగాయి. శివారు ప్రాంతాల్లో గజం ధర 8వేల నుంచి 20వేల వరకు పలుకుతోంది.

నగర కార్పొరేషన్ పరిధిలో..

నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలో పాంగ్రా, బోర్గాం, నాగారం, న్యాల్‌కల్‌రోడ్, అర్సపల్లి, బైపాస్‌రోడ్, మానిక్‌భండార్, ముబారక్‌నగర్, గూపన్‌పల్లితో పాటు ఇతర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ వెంచర్లు వెలుస్తున్నాయి. ఎకరాలకు ఎకరాలు భూములను రైతుల నుంచి కొనుగోలు చేస్తూ ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని వెంచర్ల యజమానులు గేటెడ్ కమ్యూనిటీగా పేర్లు చెబుతూ ఎక్కువ మొత్తంలో ధరలకు ఈ ప్లాట్లను అమ్మకాలు చేస్తున్నారు. వీటిపై ఫిర్యాదు రావడంతో నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కొన్ని సర్వే నెంబర్లలో వెలిసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని అధికారులకు లేఖలు రాశారు. ఆయా సర్వే నెంబర్ల వెంచర్ల ప్లాట్లను కొనుగోలు చేయవద్దని కోరారు. ఇదే రీతిలో ఆర్మూర్, బోధన్ పరిధిలో ఎక్కువగా ఈ వెంచర్లు వెలిసాయి. వీటి పరిధిలోని ఇదే విధంగా అమ్మకాలను చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అసైన్డ్ భూములను కూడా ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారు. భీంగల్ పరిధిలో కూడా ఇలాంటి వెంచర్లు వెలిశాయి.

రేరా అనుమతులు తీసుకోవాలి..

బహుళ అంతస్తుల నిర్మాణానికి రేరా అనుమతులను తీసుకోవాలి. వాటికి అనుగుణంగానే భవన నిర్మాణాలు చేపట్టారు. నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలో ఇలాంటి భవనాల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిబంధనల మేరకు ఖాళీ స్థలాలను వదిలవేయాల్సి ఉన్నా ఎక్కువ మంది పట్టించుకోవడం లేదు. భూముల ధరలు పెరగడం వల్ల ఎక్కువగా వదిలిపెట్టకుండానే నిర్మాణం చేస్తున్నారు. నగరం పరిధిలోని పలు ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు ఎక్కువగా నిర్మాణం అవుతున్నాయి. వీటి పరిధిలో కనీసం అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పే పరిస్థితులు కూడా లేవు. నిర్మాణం సమయంలో అధికారులు అడ్డంకులు చెబితే స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా మేనేజ్ చేయడం ద్వారా ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. నగరం పరిధిలో పలు భవనాలకు నోటీసులు ఇచ్చినా నిర్మాణాలు ఆపలేదు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇలాంటి భవన నిర్మాణాలు ఎక్కువగా జరిగాయి. కొన్నింటి పరిధిలో అనుమతులు లేకుండానే నిర్మాణాలను చేపట్టారు. కొన్నింటికి మున్సిపాలిటీ నుంచి అనుమతులను ఇచ్చి ఇంటి నెంబర్లు ఇచ్చారు. వీటి పరిధిలో ఎక్కువ మంది ఫిర్యాదులు చేయడంతో మొదట కొద్దిరోజులు ఆపిన తర్వాత యథావిధిగా అధికారులు పట్టించుకోలేదు. చివరకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ నేతలు కూడా ఎలాంటి అనుమతులు లేకుండా ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పలు దఫాలు ఆర్మూర్ మున్సిపాలిటీ ఎదుట బీజేపీ నేతలు ధర్నాలు చేశారు. బోధన్ మున్సిపాలిటీ పరిధిలో కూడా ఇలాంటి నిర్మాణాలు ఎక్కువగా జరిగాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులతో పాటు ఇతర అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల ఇవి ఎక్కువగా జరుగుతున్నాయి. స్థానిక నేతల ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల జోక్యంతో గతంలో ఎక్కువగా జరిగాయి. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఈ మున్సిపాలిటీల పరిధిలో నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా.. నిబంధనలు పట్టించుకోకపోవడం వల్ల యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి..

సుభాష్‌నగర్: ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖైసర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ పక్కన గల మూడు ఎకరాల స్థలంలో కొందరు కార్పొరేటర్లు అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కూడా ఈ కార్పొరేటర్లు వెంచర్ వేస్తే అడ్డుకున్నామని ప్రస్తుతం మరో వెంచర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని సయ్యద్ ఖైసర్ కోరారు.

● అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ప్లాటు ఇదే..



బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 30: బీసీ డిక్లరేషన్ సందర్భంగా కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా పిలుపు మేరకు జిల్లా ఓబీసీ నాయకులు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో అన్ని మండల కార్యాలయాల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ధర్నా నిర్వహించినా.. ఇప్పటికీ సీఎం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం 9,200 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు బీసీలకు బడ్జెట్‌లో అధిక బడ్జెట్ కేటాయించాలని అదే విధంగా జనాభా ప్రకారం 42శాతం రిజర్వేషన్లను పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యం పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- శ్రీరాంసాగర్ ఆయకట్టుకు పెరుగుతున్న భరోసా
- ప్రతీరోజు రెండు టీఎంసీల వరకు వరద
- విష్ణుపురి నిండటంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు

నిజామాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రతిరోజూ రెండు టీఎంసీల వరకు ప్రాజెక్టులో నీళ్లు చేరుతున్నాయి. గోదావరికి ప్రధానంగా వరద మహారాష్ట్రలో పడే వర్షాలే ఆధారమైన ఆ నదిపై ఎక్కువగా ప్రాజెక్టులు ఉండటం అవి మొత్తం నిండకపోవడం వల్ల ఇప్పటి వరకు భారీ వరద మొదలు కాలేదు. మహారాష్ట్రలోని నాందేడ్ పరిధిలో ఉన్న విష్ణుపురి, బాలేగావ్, అందూరా, బాబ్లీ ప్రాజెక్టులు నిండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతుంది. నాందేడ్ వద్ద ఉన్న విష్ణుపురి ప్రాజెక్టు నాలుగు రోజుల క్రితం నిండటంతో ప్రతీరోజు 10వేల నుంచి 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అక్కడి నుంచి బాలేగావ్ మీదుగా బాబ్లీకి వరద వస్తుంది. బాబ్లీ గేట్లు ఎత్తి ఉండటం వల్ల గోదావరి ద్వారా ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. మహారాష్ట్రలోని గోదావరిపై నాసిక్ నుంచి బాబ్లీ వరకు చిన్నా పెద్ద ప్రాజెక్టులు కలిపి సుమారు 15 వరకు ఉన్నాయి. వీటిలో జైక్వాడ్ ప్రాజెక్టు అతి పెద్దది. ఈ ప్రాజెక్టు 112 టీఎంసీల కెపాసిటీతో నిర్మించారు. ప్రస్తుతం ఎస్సారెస్పీకి 17,100 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు 1076.2 అడుగులకు నీటిమట్టాలు చేరాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 35.537 టీఎంసీలకు నీళ్లు చేరాయి. ఎగువ ప్రాంతంలోని గోదావరిపై ఉన్న చిన్న ప్రాజెక్టులు నిండటం వల్ల ఈ ప్రాజెక్టు ఈయేడాది నిండుతుందని రైతుల్లో భరోసా పెరుగుతోంది. ఇప్పటికే 35 టీఎంసీలు రావడం వల్ల ఆగస్టులో పడే వర్షాల వల్ల ప్రాజెక్టు నిండుతుందని అంచనా వేస్తున్నారు. అక్టోబర్ వరకు వర్షాలు పడే అవకాశం ఉండటం బాబ్లీగేట్లు ఎత్తి ఉండటం వల్ల ప్రాజెక్టుకు నీళ్లు వస్తాయని భావిస్తున్నారు. గోదావరితో పాటు మంజీరా, హరిదా నదుల నుంచి కూడా వరద వచ్చే అవకాశం ఉండటంతో ఈయేడాది కూడా నిండుతుందని ఎస్సారెస్పీ అధికారులు అంచనాకు వస్తున్నారు. మహారాష్ట్రలోని విష్ణుపురికి నిండటం వల్ల ప్రస్తుతం వరద వస్తుందని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈ వంశీలు తెలిపారు. మహారాష్ట్ర వర్షాల వల్ల వరద పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

జిల్లాలో జల్లులతో కూడిన వర్షం..

జిల్లాలో జల్లులతో కూడిన వర్షం పడింది. జిల్లాలోని కొన్ని మండలాల పరిధిలో జల్లులు పడగా మరికొన్ని మండలాల్లో పడలేదు. జిల్లాలో సరాసరి రెండు మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు 425 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 534.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షం పడింది.

పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ధ్వంసం

● గుమ్మిర్యాల్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు



నాగేంద్రనగర్‌లోని పల్లె ప్రకృతి వనం

ఏర్గట్ల, జూలై 30: మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ధ్వంసం చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే గత రెండు రోజుల క్రితం గుమ్మిర్యాల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నాగేంద్రనగర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో రాత్రిల్లో ట్రాక్టర్‌తో మొక్కలు ధ్వంసం చేస్తున్నట్లుపై ఉన్నతాధికారులకు తెలపడంతో గుమ్మిర్యాల్ వీడీసీ సభ్యులపై పీడీపీపీ కింద కేసు నమోదు చేసినట్లు భీమ్‌గల్ సీఐనవీన్ తెలిపారు. పల్లె ప్రకృతి వనంలో దాదాపు 1600 మొక్కలు ధ్వంసం రూ.3లక్షల 50 వేల ఆస్తినష్టం జరినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ

రెంజల్,జూలై30: మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆర్‌సీవో మహ్మద్ బషీర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మైనారిటీ పాఠశాలలకు కోట్లాది రూపాయలను వెచ్చించి నాణ్యత ప్రమాణాలతో కూడిన చదువుతో పాటు భోజనం అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వంటగదిని సందర్శించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ హర్షియా నాజీమ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 63 నిర్మాణానికి రైతులు సహకరించాలి

● ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

మోర్తాడ్, జూలై 30: పెర్కిట్ నుంచి మంచిర్యాల సెక్షన్ వరకు ఎన్‌హెచ్ 63 హైవే కోసం దోన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్ అన్నారు. మంగళవారం మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయంలో మూడు గ్రామాల రైతులతో మాట్లాడారు. దోన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్ గ్రామశివారులమీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణం జరుతున్నదని దీనికోసం రైతుల నుంచి సేకరించిన భూములకు సంబందించి నష్టపరిహారం విషయాన్ని వివరించారు. రైతులు ఇచ్చిన విజ్ఞప్తులను ఆర్డీవో స్వీకరించారు. రైతులు భూకొలతలకు వ్యత్యాసం విషయంలో,సంబంధిత విషయాల్లో రైతుల విజ్ఞప్తులను తీసుకున్నారు. రోడ్డుకోసం సేకరించిన భూమిల్లో ఉన్న బోర్లు బావులు, పైప్‌లైన్‌లకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దాదర్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సుజాత, సర్వేయర్‌లు, ఆర్ఐ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపాలిటీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

ఆర్మూర్ టౌన్ జూలై 30: పట్టనంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన దరకాస్తులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. దరకాస్తుల సవరణ, వారి సమస్యలను వివరంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుదారుల ఎడిట్ ఆప్షన్ అన్నింటికీ వచ్చేలా చేయాలని పలువురు కౌన్సిలర్‌లు ఆయన దృష్టికి తెచ్చారు.మున్సిపల్‌లో ఉన్న సమస్యలపై కమిషనర్ రాజును అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణంలో అట్టహాసంగా జాబ్ మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు

భిక్కనూరు, జూలై 30: భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో దోమకొండకు వెళ్లేదారిలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు వరకు ఈ క్యాంపస్ ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీజీ సెంటర్‌గా కొనసాగేది. ఈ పీజీ సెంటర్‌లో విద్యను అభ్యసించిన చాలామంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. దాదాపుగా 60ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ క్యాంపస్ ప్రస్తుతం టీయూ సౌత్‌క్యాంపస్‌గా కొనసాగుతుండగా సువిశాలమైన తరగతి గదులు, అన్ని సౌకర్యాలు కలిగిన వసతీగృహాలు, గ్రంథాలయం ఉండగా గత 10సంవత్సరాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం ఈ సౌత్‌క్యాంపస్‌కు చాలా డిమాండ్ ఉంది. కానీ ఇది వరకు ఓయూ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు కానీ, టీయూ ఏర్పడ్డాక కానీ ఈ సౌత్‌క్యాంపస్‌లో ఎప్పుడు జాబ్ మేళాలు జరగలేదు. ప్రస్తుత వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌ల ఆదేశాల మేరకు టీయూట్రైనింగ్ అండ్‌ప్లేస్మెంట్‌సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫ ర్మెటిక్స్ విభాగం సంయుక్తంగా హైదరాబాద్‌లోని క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జియోఇన్ఫర్మెటిక్స్ పూర్తిచేసిన ప్రస్తుతం అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రత్యేకంగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించగా విశేష స్పందన వచ్చింది.

● పెద్దఎత్తున పాల్గొన్న జియోఇన్ఫర్మెటిక్ విద్యార్థులు

మొట్టమొదటిసారిగా సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్‌కు విశేషస్పందన వచ్చింది. జియోఇన్ఫర్మెటిక్స్ విద్యను పూర్తి చేసిన, ప్రస్తుతం అభ్యసిస్తున్న 35మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఈ జాబ్‌మేళాలో కంపెనీ ప్రతినిధులు రిజిస్టర్ చేసుకున్న 35మందికి వ్యక్తిగత పరిచయ రౌండ్, గ్రూప్ డిస్కషన్, ముఖాముఖీ, పరిక్షలలో ప్రతిభ ఆధారంగా 9మందిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు కోర్సు పూర్తి అయినవారు ఉండగా, మిగితా వారు మొదటి, రెండవ సంవత్సరం అభ్యసిస్తున్న వారు ఉన్నారు. కాగా చాలామందికి ఈ విషయం తెలియక రిజిస్టర్ చేసుకోవడం వీలుకాలేదని, కొద్దిగా సమయం ఇస్తే మరింత ఎక్కువ మంది క్యాంపస్ ప్లేస్మెంట్‌కు రిజిస్టర్ చేసుకునే వారని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● క్యాంపస్ ప్లేస్మెంట్‌లో ఎంపికైన వారు వీరే

క్యాంపస్ ప్లేస్మెంట్‌కు 35మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో తిరుమలేష్ (సెకండ్ ఇయర్),రాచూరిదివ్య(సెకండ్‌ఇయర్). గాజుల భార్గవ్ (సెకండ్ ఇయర్),సల్లూరిస్పందన(సెకండ్ ఇయర్), అనీల్‌కుమార్, భాస్కర్, యువకిరణ్, ప్రనూష, అనీత ఎంపికయ్యారు.వీరికి క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీ సిబ్బంది నియామక పత్రాలను అందజేశారు.

● దక్షిణప్రాంగణంలో క్యాంపస్ ప్లెస్మెంట్ నిర్వహించడం మొదటిసారి

టీయూ సౌత్‌క్యాంపస్‌లో క్యాంపస్ ప్లెస్మెంట్ నిర్వహించడం ఇదే మొదటిసారి చాలా సంతోషంగా ఉంది. విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కల్పన అత్యంత ముఖ్యం.రానున్న రోజుల్లో సౌత్‌క్యాంపస్‌లో టీయూ ప్లేస్మెంట్ వారి సహకారంతో జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తా. సౌత్‌క్యాంపస్‌లో జాబ్‌మేళా నిర్వహించడానికి కృషిచేసిన రిజిస్టర్ యాదగిరి గారికి ధన్యవాదాలు.

● ఉద్యోగం రావడం అదృష్టంగా భావిస్తున్నాం : నక్క తిరుమలేష్

సెకండ్ ఇయర్ చదువుతన్న సమయంలోనే నాకు ఉద్యోగం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇందుకు నేను చాలా కష్టపడ్డా. మా అధ్యాపకులు తమకు ఎంతో సహకరించారు. ఇదివరకు ఎన్ఆర్ఎస్‌సీలో ఒక ప్రాజెక్టు చేశాను. అది నాకు ఉపయోగపడింది. నాకు జాబ్ రావడానికి నన్ను అన్నివిధాలుగా సన్నద్ధం చేసిన గురువులకు కృతజ్ఞతలు.

● నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగింది : స్పందన


స్పందన

ఇంటర్న్‌షిప్‌లో భాగంగా దేశంలో ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో (ఎన్ఆర్ఎస్‌సీ)లో ప్రాజెక్టు చేశా. దీని వలన నాకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగింది. అందుకే ఈ జాబ్‌మేళాలో విజయవంతంగా అన్నిపరిక్షలను పూర్తి చేసి ఉద్యోగం సాధించా. ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాకు ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

● ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డా : కేతావత్ అనిల్


అనిల్

ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డా, భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో జియో ఇన్ఫర్మెటిక్స్ పూర్తిచేశా. ఐఎన్‌సీఓఐఎస్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేశా. అనం తరం ఉద్యోగానికి ప్రిపేర్ అవుతుండగా సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు తమకు సమాచారం అందించగా ప్లేస్మెంట్‌కు రిజిస్టర్ చేసుకున్నా. ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్, ఇతర పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగానికి ఎంపికయ్యా. ఇందుకు నాకు సహకరించిన గురువులకు కృతజ్ఞతలు.

మోస్రా మండల పాఠశాలల్లో సమస్యలెన్నో..

● మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులు, విద్యార్థుల ఇక్కట్లు ● బురద మయంగా చింతకుంట పాఠశాల ● పట్టించుకోని సంబంధిత అధికారులు


మోస్రా పాఠశాల ఆవరణలో పందులు


పాఠశాల పక్కన మురికి కాలువ శుభ్రం చేయని దృశ్యం


ఎండిన చెట్టు గోడపై కూలేందుకు సిద్ధంగా ఉన్న దృశ్యం

మోస్రా,జూలై30: మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ పాఠశాలలు మూడు ఉన్నాయి. ఒకటి బాపనయ్య నగర్, రెండో పాఠశాల వారసంత దగ్గర, మూడో పాఠశాల పిట్ల గంగాధర్ కాలనీలో కలవు. వారసంత వద్ద ఉన్న పాఠశాలలో ప్రధానంగా మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులకు పాఠశాల పిల్లలకు చాలా ఇబ్బంది అవుతుంది. నీళ్ల కొరకు బయట నుండి పైపు ద్వారా నీళ్లు నింపుకుంటూ కొనసాగిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఎండిపోయి చెదలు పట్టిన చెట్టు వంగిపోయి పాఠశాల ఆవార గోడపై పడి ప్రమాదం జరిగేలా ఉంది. అనుకోకుండా జరిగే సంఘటన వల్ల గోడ కూలిన పిల్లలపై పడిన జరిగే నష్టం చెప్పలేము. పాఠశాల ఆవరణలో పిల్లలు ఆడుకునే స్థలంలో మట్టి కుప్పలు వేశారు. పిచ్చిమొక్కలు పెరిగి పాములు వస్తున్నాయి. మా పాఠశాలలో అటెండర్ లేనందున గ్రామ పంచాయతీ వారికి ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని వీళ్లు ఈ చెత్త అంత తీసేస్తే మేము మొక్కలు నాటుకోవడానికి మా పాఠశాల ఆవరణలో శుభ్రంగా చూసుకోవడానికి ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు శోభాబాయి తెలిపారు.

● పిట్ల గంగాధర్ కాలనీ పాఠశాలలో ఒకే మరుగుదొడ్డి

పిట్ల గంగాధర్ కాలనీ పాఠశాలలో ఒకటి మరుగుదొడ్డి ఉందని విద్యార్థులకు బాల, బాలికలకు ఇబ్బంది అవుతుందని ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు పాఠశాల వెనకే ఉన్న రెండు పడకల గదుల కాలనీ నుండి ఎక్కువ విద్యార్థులు వస్తున్నారు. ఐదే ప్రధానంగా పాఠశాల నుండి విద్యార్థులు ఇంటికి వెళ్లే దారి పూర్తిగా బురదమయం ముళ్లచెట్లతో అడవిని తలపిస్తుంది. పాఠశాల వెనుక ముందు డ్రైనేజీ లేని కారణంగా పాఠశాల చుట్టు మురికిగా ఉండి ముళ్ల పొదలతో నిండిపోయింది. పక్కనే ఉన్న కాలనీకి వెళ్లే విద్యార్థులు ఇక్కడ డ్రైనేజీ నిర్మాణం లేక కాలనీ చుట్టు తిరిగిఆ వెళ్తున్నారు. ఇక్కడ ఉన్న ఈ పరిస్థితి వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంకరమైన రోగాల బారిన పడి అవకాశం ఉన్నది. పాఠశాలలోకి పందులు వస్తూ ఉన్నాయి. వాటి వల్ల మా పాఠశాల పరిస్థితి అగమ్య గోచారంగా మారిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి ఈ పాఠశాల సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● బురదమయంగా చింతకుంట జిల్లా పరిషత్ పాఠశాల

మండలంలోని చింతకుంట గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో వర్షం పడితే పాఠశాల ఆవరణలో అంత చిత్తడిగా బురదగా ఉంటుంది. ఎన్నోసార్లు విద్యార్థులు కాలు జారి పడిపోవడం జరిగింది. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు వస్తున్నాయి. విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అదే విధంగా నీటి కొరత ఉన్నదని బోర్ వేసి సమస్యలు పరిష్కారం చేసుకోగా బోర్ మోటార్ పాఠశాల యాజమాన్యంకు తెలియపరచకుండానే మోటార్ తీసుకెళ్లారు. బోర్ మోటార్ లేని బోర్ కేసింగ్ పైప్‌లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి మరో మోటార్ వేసుకోకుండా ఇబ్బందులు చేశారు. ప్రహరి గోడ లేక మా పాఠశాలలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇట్టి ప్రతి విషయాలు గ్రామ పెద్దలకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపిన పరిష్కారం చేయడం లేదని ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ తెలిపారు.

పాములతో భయంగా ఉంది

పాఠశాలలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయి. మట్టికుప్ప, ఇటుకల కుప్పలో ఉండగా పిల్లలు బయటపడుతున్నాయి. ఎండిన చెట్టు వలన ఎప్పుడు ఎవరికి ఏమి జరుగుతుందో భయమేస్తుంది. సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే శుభ్రం చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

\- రాజు, పాఠశాల విద్యార్థి, మోస్రా

ప్రహరీ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం

ప్రహరీ లేక లోపల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఎవరో ఇక్కడే మద్యం తాగుతూ సీసాలు పడేస్తారు. సిగరేట్ ముక్కలు, రోజు ఇబ్బందిగా ఉండే విద్యార్థులకు, మాకు చాలా ఇబ్బందిగా ఉంది. కావున సంబంధిత గ్రామ కమిటీ, గ్రామ పంచాయతీ సభ్యులు ప్రహరీ నిర్మించి, పాఠశాలలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాను.

\- మధుసూధన్, హెచ్ఎం, చింతకుంట

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


బోధన్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై30: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయడం అభినందనీయమని మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా కాంగ్రెస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ ఎన్నికలలో రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫీ హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రైతులను అభివృద్ధి చేయడానికి మరిన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు దశాలవారిగా రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషా మొయినోద్దీన్, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కౌన్సిలర్ శరత్ రెడ్డి, హరికాంత్ చారి, విష్ణువర్ధన్‌లతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రెండోవిడత రుణమాఫీ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండోవిడత రుణమాఫీలో భాగంగా మంగళవారం రైతులకు ఒక లక్షా 50 వేల లోపు రుణమాఫీ జరిగినట్లు ఏఈవో శ్రావణి తెలిపారు.రుద్రూరు మండలంలోని రైతు వేదికలో రుణమాఫీ కార్యక్ర మానికి రైతులు హాజరయ్యారు. అదే విధంగా రైతు బీమాకు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలకేంద్రంలోని రైతుభవనంలో మంగళవారం రెండవిడత రుణమాఫి సందర్భంగా ముఖ్యమంత్రి విడియో ప్రసంగాన్ని బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చార్జ్ ముత్యల సునీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, రైతులు తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఇచ్చినహామీలను తూచాతప్పకుండా అమలు చేయడం ఒక్క కాంగ్రెస్ వల్లే సాధ్యమని,సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఒకొక్కటిగా హామీలను అమలుపరుస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆగస్టు 15 లోపు పూర్తిస్థాయి రుణమాఫీ జరుగుతుందన్నారు. రైతురాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేమన్నారు.ఈ సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడిగెల ప్రవీన్ డీసీసీ కార్యదర్శి తక్కూరి దేవేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్ల కొండ రాజేష్, బుచ్చిమల్లయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే ఆందోళన వద్దు

ఏర్గట్ల, జూలై 30: సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడితే ఆందోళన చెందకుండా పోలీసులకు సమాచారం అందించాలని భీమ్‌గల్ సీఐ నవీన్ తెలిపారు. మంగళవారం మండలంలోని తడపాకల్ గ్రామంలో ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు మీభర్త దుబాయ్‌లో మావద్ద ఉన్నాడని రూ. 50వేల నగదు ఇస్తే మీ భర్తను విడిచిపెడతామని ఫోన్ రావడంతో పోలీసులను ఆశ్రయించిందని, అది ఫేక్‌కాల్ అని తెలియడంతో వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. సైబర్ నేరస్థులు గానీ, పోలీసులు డీపి పెట్టుకొని గానీ ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు అడిగితే పంపవద్దని, అనుకో కుండా డబ్బులు పంపిస్తే వెంటనే 1930కి కాల్ చేసి విషయం తెలపాలని సీఐ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఒకరి దారుణ హత్య

● కుటుంబ సభ్యులపైనే అనుమానం ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన బోధన్ ఏసీపీ శ్రీనివాస్


లాలయ్య మృతదేహం, లాలయ్య (ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఏసీపీ

కోటగిరి,జూలై30: పొతంగల్ మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ లాలయ్య(55)అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. లాలయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు కర్రతో దాడి చేసి ముఖంపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని బోదన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. వివరాల్లోకి వెళితే స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మేస్త్రీ లాలయ్యకు ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం ఉన్నారు. ఓ భార్య వీరికి దూరంగా ఉంటుంది. లాలయ్య గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. గత కొంతకాలం క్రితం లాలయ్య పక్షవాతానికి గురై ఇంటి పట్టునే ఉంటున్నాడు.రెండో భార్య హన్మవ్వతో కలిసి ఉంటున్నాడు.భార్య, కూతుళ్ల ప్రవర్తనపై పలు అనుమానాలు ఉన్నాయి. లాలయ్య వారిపై తరుచు గొడవ పడే వాడని తెలిసింది. సోమవారం రాత్రి సైతం మరోమారు గొడవ జరిగినట్లు తెలిసింది.అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్రతో దాడి చేసి బండరాయిపై ముఖంపైమోదీదారుణంగా హత్యచేశారు.ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి బోదన్ ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి,ఎస్ఐ సందీప్‌లు చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌ను తీసుకువచ్చారు.ఘటనస్థలం నుంచి డాగ్‌స్క్వాడ్ తిరిగి అక్కడికే చేరుకుంది.కుటుంబ సభ్యుల ప్రవర్తనే హత్యకు దారి తీసినట్లుగాపోలీసులు భావిస్తున్నారు.మృతుడి భార్యహన్మవ్వను పోలీసులు అదుపులోకి తీసుకునివిచారిస్తున్నారు.మృతుడి సోదరుడు పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుఎస్ఐ సందీప్ తెలిపారు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియాఆసుపత్రికి తరలించారు.


డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీల దృశ్యం

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ

బోధన్‌రూరల్,జూలై30: బోధన్ పట్టణంలో మంగళవారం ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి బోనం ఎత్తి అమ్మవారి ఆలయాల వరకు ఆరె కటికె సంఘం మహిళతో కలిసి బోనాలతో వెళ్లారు. మహలక్ష్మి, పెద్దమ్మ తల్లి ఆలయాలల్లో ఒడిబియ్యం నింపి, చీరసారెలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురువాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆరె కటికె ట్రస్ట్ చైర్మన్ గౌలికర్ నర్సింగ్ రావు, వికారాబాద్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జయ నర్సింగ రావు, బోధన్ డివిజన్ నాయకులు చౌదరి గంగారాం, రాజులాల్, మోహన్, మహేష్, రాజేందర్, రాజేశ్వర్, సాయినాథ్, గంగాలాల్, గోపి, రాఖీ, మహేష్, కుల సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: తెలంగాణ ప్రజలు సంస్కృతిని ప్రతిబింబిస్తూ జరుపుకునే ప్రధాన పండుగలో బోనాల పండుగ ప్రత్యేకమైంది. రుద్రూరు మండల కేంద్రంలోని చిక్కడ్‌పల్లి గ్రామంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భజా భజంత్రీలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి పోచమ్మకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు వృద్ధి చెందాలని గ్రామం బాగుండాలని, కుటుంబాలు చల్లగా ఉండాలని, పిల్లాపాపలు ఎటువంటి అనారోగ్యం బారిన పడకుండా కాపాడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


బోనం ఎత్తిన బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

'ఉద్యోగుల భవిష్యనిధి' ఆధ్వర్యంలో రక్తదానం

పెద్దబజార్, జూలై 30: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ గణేష్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని అన్నారు. రక్తదానం చేసిన వారిని ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మధుసూదనాచారి, భాస్కర్‌తో పాటు 25 మంది ఉద్యోగులు రక్తదానంలో పాల్గొన్నారు.

5 నెలల వరకు తనిఖీలు చేపట్టాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పెద్దబజార్, జూలై 30: ఆగస్టు 1వ తేదీ నుంచి 5 నెలల పాటు అన్ని పనిదినాలల్లో ప్రతీరోజు వంద ఇళ్లను తనిఖీ చేయాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ మెడికల్ శిక్షణ కళాశాలలో కొత్తగా ఎంపిక చేసిన దోమల లార్వా సెంపకం సెక్టర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల లార్వా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. దోమలు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులలో యూపీహెచ్‌సీలు, ఎంవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శిని నియమించాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 30: ముప్కాల్ మండలం వేంపల్లి పీఏసీఎస్‌లో కార్యదర్శి పదవి ఖాళీగా ఉందని, వెంటనే కొత్త కార్యదర్శిని నియమించాలని జిల్లా సహకార శాఖ అధికారికి పీఏసీఎస్ చైర్మన్ జక్కరాజేశ్వర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా సహకార శాఖ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు పలువురు డైరెక్టర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. గత పాలకవర్గం మార్క్‌ఫెడ్ బకాయిలు ఉండటం వల్ల తమకు ఫర్టిలైజర్ సప్లై చేయడం లేదని ప్రస్తుతం సప్లై చేసినచో వెంటనే బిల్లులు చెల్లిస్తామని గతంలో బకాయిలు చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్, ప్రశాంత్, ఆనంద్, నంద, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూలై 30: తెలంగాణ విద్యార్థి పరిషత్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నగరంలో ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్థూపం వద్ద టీజీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయుష్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ 2012 జూలై 30న ఉస్మానియా యూనివర్సిటీలో టీజీవీపీ పురుడు పోసుకుందని మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిని పక్కనపెట్టడంతో గత దశాబ్దకాలంగా విద్యార్థుల సమస్యలపై టీజీవీపీ పోరాడుతుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని లేకపోతే ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిరుధ్, ప్రశాంత్, మహేష్, సుజిత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్, జూలై 30: నగరంలోని దుబ్బ ప్రాంతంలోగల 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కెవి ప్రభాత్‌టాకీస్ రెండవ ఫీడర్‌లో ఏబి స్విచ్ అమర్చడానికి బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5.30ల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ ఆపరేషన్ టౌన్-2 తోటరాజశేఖర్ తెలిపారు. దీంతో సంజీవయ్యకాలనీ, దుబ్బ, అంబేద్కర్ కాలనీ, శివాజీచౌక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. 10గంటల నుంచి 12.30ల వరకు ప్రభాత్‌టాకీస్ ఒకటవ ఫీడర్ ఏబీ స్విచ్ అమర్చడానికి దుబ్బ, అంబేద్కర్ కాలనీ, సంజీవయ్యకాలనీ, పవన్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు. వర్షం వస్తే పనిచేయడం జరగదని తెలిపారు.

ప్రమాదాల నివారణకు ఆర్టీసీ ఉద్యోగుల ప్రయత్నాలు

- ఆర్టీసీ ప్రమాదరహిత వారోత్సవాల కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్


మాట్లాడుతున్న సీపీ


ఉత్తమ డ్రైవర్లతో పోలీసు కమిషనర్ కల్మేశ్వర్

సుభాష్‌నగర్, జూలై 30: ఆర్టీసీ ఉద్యోగులు ప్రమాదాలు జరగకుండా ఉండడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో-2 కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రమాదరహిత వారోత్సవాల కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో శిక్షణ కలిగిన డ్రైవర్లు ఉంటారన్నారు. ప్రమా దాలు జరగకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ఇతరుల తప్పిదం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో డ్రైవర్లపై కేసులు నమోదవుతున్నాయన్నారు. డ్రైవర్లు మానసిక ప్రశాంతతో బస్సులను నడపాలన్నారు. డ్రైవర్లతో పాటు ప్రమాదం జరగకుండా ఉండాలంటే కండక్టర్లు సైతం తమ వంతు పాత్రను పోషించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్టీసీ ప్రమాదరహిత వారోత్సవాల్లో భాగంగా డిపోకు ముగ్గురు చొప్పున ఉత్తమ ప్రమాదరహిత డ్రైవర్లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నారాయణ, రీజియన్ మేనేజర్ జానీరెడ్డి, డిప్యూటీ రీజయన్ మేనేజర్‌లు సరస్వతి, శంకర్, డిపో మేనేజర్లు ఆనంద్, సాయన్న, శ్రీనివాస్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

తండాల్లో ఘనంగా తీజ్ పండుగ


నల్లగుట్ట తండాలో తీజ్ పండుగలో పాల్గొన్న గిరిజనులు

నిజామాబాద్ రూరల్, జూలై 30: రూరల్ మండలం చక్రదర్‌నగర్ తండాలో తీజ్ పండుగ ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని సేవాలాల్ ఆలయంలో పూజలు చేశారు. ఇంటికి ఒకరు చొప్పున మహిళలు తీజ్ తీశారు. పెళ్లికాని యువతులు తీజ్‌ను ఇంటినుంచి తీజ్‌ను (గోదుమ గడ్డి) బుట్టల్లో పేర్చి దాన్ని నెత్తిమీద పెట్టుకుని తండాలో ఊరేగింపు తీశారు. అనంతరం తీజ్‌ను చెరువులో నిమజ్జనం చేశారు. ప్రతీసంవత్సరం మాదిరి ఈ సారి కూడా తీజ్ పండగు నిర్వహించామని తాజామాజీ సర్పంచ్ హరినాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతావత్ హరినాయక్, సుదర్శన్ నాయక్, కెతావత్ ప్రకాష్‌నాయక్, లాల్ నాయక్, రూప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని నల్లగుట్ట తండాలో మంగళవారం తీజ్ పండుగను గిరిజన పెద్దలు, నాయకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యువతులు, మహిళలు గోధుమ మొలక బుట్టలను నైవేద్యాలతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం గోధుమ మొలక బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. తీజ్ పండుగ పాటలు పాడుతూ గిరిజన మహిళలు ఆనందోత్సహాల మధ్య పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎం.చిన్నసాయిరెడ్డి, మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ నాయక్, నల్లగుట్ట తాండా గిరిజన పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలని ధర్నా

ఆర్మూర్ టౌన్ జూలై 30: మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గత పాలనలో వాహనాలు కొనుగోలు, అక్రమంగా ఇళ్ల నెంబర్ల కెటాయింపులపై ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేయడం జరిగింది. తక్షణం విచారణ చేపట్టి రద్దయిన ఇంటినెంబర్ల రిజిస్ట్రేషన్ చేయకుండి సబ్‌రిజిస్టర్‌కు నివేదించాలని అన్నారు. అలాగే మున్సిపల్ పరిదిలోగల ప్రభుత్వ భుములను గుర్తించాలని తెలిపారు. మిన్సిపల్‌లో జరుగుతున్న అక్రమాఅల గురించి ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ విచారణ జరిపించకపోడవడం విడ్డురమని ఎద్దేవా చేశారు, ఈ కార్యక్రమంలో ద్యాగ ఉదయ్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, అనిల్, ఆకుల శ్రీనివాస్ యుగందర్, రాజేశ్వర్ ప్రశాంత్, జాగిర్దార్ శ్రీనివాస్, పాన్ శ్రీను, విజయానంద్ తదితరుల పాల్గొన్నారు,

రెండో విడత రుణమాఫీపై రైతుల హర్షం

నవీపేట, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీకి చెందిన నిధులను మంగళవారం విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పాటికే లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయగా మంగళవారం లక్ష రూపాయల నుంచి 1.50లక్షల రూపాయల రుణమాఫీ చేయడం పట్ల రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని జన్నేపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీవీ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని రైతులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ప్రశాంత్, వినోద్, పలువురు రైతులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం

మోస్రా, జూలై 30: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2003సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 28వ తేదీ ఆదివారం రోజు 2002-03సంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థుల వారు చదివిన పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్న విషయం విదితమే. కాగా ఆ ఆత్మీయ కలయికలో భాగంగా తాము చదివిన పాఠశాలకు తమవంతు సహాయంగా ఏమైనా చేస్తామని ప్రధానోపాధ్యాయుడు బాలాజీని అడగగా పాఠశాలలో ల్యాబ్ నిమిత్తం ఏమైనా చేయండని కోరగా తమవంతు సహాయంగా పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పదోతరగతి విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, సైనాపురం నర్సారెడ్డి, రాంబాబు, ఖలీల్‌ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

నవీపేట, జూలై 30: మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ బినోల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. నిజామాబాద్‌కు చెందిన వ్యాపారస్థులు విజయ్ మిఖిల్ శర్మ, రోహిత్ గులాబానిల ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 40మంది విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, సతీష్ వ్యాస్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.


పాఠశాలను తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

ముప్కాల్, జూలై 30: బాల్కొండ మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులు త్వరతగిన పూర్తి చేయాలని జిల్లా అధనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తదనంతరం వన మహో త్సవంలో భాగంగా మండలంలోని బస్సాపూర్ గ్రామంలో సంపద వనంను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సరంక్షిచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్, ఎంపీవో గంగామోహన్, అనిత్, ఏపీఎం శివగంగాధర్, ధనుం జయ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ధుంధూల్ హుస్సేన్ సవారీ

కోటగిరి, జూలై 30: మండల కేంద్రంలో మంగళవారం ధుంధూల్ హుస్సేన్ సవారీ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబంగల్లీ రోడ్డులో ప్రతిష్ఠించిన పీర్లను గ్రామంలో ఊరేగించారు. పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గద్దెలపై పీర్లను కూర్చొబెట్టారు. గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల అరెస్టు సరికాదు

బోధన్‌రూరల్, జూలై 30: బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు దుర్గాదాస్ అన్నారు. మంగళవారం అదృశ్యమైన విద్యార్థి కోసం తల్లిదండ్రుల పక్షాలన ఏబీవీపీ నాయకులు ధర్నా చేస్తే పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అదృశ్యమైన విద్యార్థిని వెంటనే కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాము, తదితరులున్నారు.

వాగ్దానాల అమలుకు ఉద్యమిద్దాం

బోధన్‌రూరల్, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలుకు ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. పట్టణంలోని తట్టికోటలో గోడప్రతులను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు, బీడీ కార్మికులకు జీవన భృతి, వృద్దాప్య, వితంతువు, వికలాంగులకు పింఛన్‌లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, గంగారాం, బాలయ్య, సాయిలు, శంకర్, రాజు, లక్ష్మీబాబు, అరుణ, సూర్యకళ, లక్ష్మి తదితరులున్నారు.


సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

సుభాష్‌నగర్, జూలై 30: మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్పొరేషన్ పరిధిలోని వాటర్ సప్లై, స్ట్రీట్‌లైట్, గార్డెన్, ఫిల్టర్‌బెడ్స్‌లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీవో నంబరు 60 ప్రకారం కనీస వేతనం రూ.19,500లు ఇవ్వాల్సి ఉండగా రూ.16,500లు అమలు చేస్తున్నారని అన్నారు. జీవో ప్రకారం కనీస వేతనం 19,500లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ గత సంవత్సరం కాలంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు అనేక వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, లేబర్ కమిషన్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లకు విన్నవించడం జరిగిందన్నారు. అయినా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో కార్మిక చట్టాలను అనుసరించి చట్టబద్ధంగా సమ్మె నోటీసు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమ్మెనోటీసు ఇచ్చిన 15 రోజుల్లోపు కార్మికులకు కనీస వేతనం 19,500లు అమలు చేస్తున్నట్లు ప్రకటించకపోతే ఆగస్టు మొదటి వారంలో ఎప్పుడైనా కార్మికులు సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందని తెలిపారు.

చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 30: చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సీఎస్‌డీఎఫ్ నిధులను గత ప్రభుత్వం కంటే 3500 కోట్లను తగ్గించి ఇవ్వడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం దళిత వ్యతిరేకాన్ని ప్రదర్శించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో చేవెళ్లలో ప్రకటించినటువంటి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అభయహస్తం పేరుమీద ప్రతీ దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ప్రకటించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలంరాజు, సందీప్, సాయికుమార్, కిశోర్, భాస్కర్, వీరేందర్, విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల వారోత్సవాలు


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

ధర్పల్లి, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పాఠశాలల్లో ప్రారంభించిన వారోత్సవాలు ముగిశాయి. మంగళవారం జరిగిన తిథి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు వివిధ రకాల వంటకాలను వడ్డించారు. ప్రతీరోజు ఒక కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఈ వారోత్సవాలు ఏర్పాటు చేశారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులు తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, ధర్పల్లి సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున్, వీడీసీ చైర్మన్ మహేందర్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, సురేందర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిథి భోజన కార్యక్రమానికి స్పందన

సిరికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజన కార్యక్రమంలో భాగంగా ముంబాయికి చెందిన వస్త్ర వ్యాపారి మాడల్ స్కూల్ విద్యార్థులకు సంకిన్, స్వీట్లు పంపిణీ చేశారు. సిరికొండ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్, సిరికొండ వీడీసీ సభ్యులు స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల శ్రీనివాస్, సతీష్‌కుమార్ గౌడ్, ఉపాధ్యాయులు, వీడీసీ అధ్యక్షుడు జలందర్, సభ్యులు పాల్గొన్నారు.

సీఐటీయూ నేతల ముందస్తు అరెస్టు

పెద్దబజార్, జూలై 30: ఛలో హైదరాబాద్ నిరసన కార్యక్రమాల సందర్భంగా సీఐటీయు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మంగళవారం సీఐటీయు నాయకులు రామ్మోహన్‌రావు, నూర్జహాన్, రమేష్‌బాబు, సీపీఐ నాయకులు ఓమయ్య, సుధాకర్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి నాల్గవ టౌన్‌కు తరలించారు. సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు తెలుపుతుంటే ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని నాయకులు మండిపడ్డారు. ముందస్తు అరెస్టులతో నిరసనలు ఆపలేరని తెలిపారు.

పోలీసులమని చెప్పి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు

జక్రాన్‌పల్లి, జూలై 30: పోలీసులమని చెప్పి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర నుంచి వాట్సప్ ద్వారా సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసినట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం గుర్తుతెలియని సైబర్ నేరగాళ్లు పడకల్ గ్రామానికి చెందిన వ్యక్తికి వాట్సప్ ద్వారా ఫోన్ చేసి పోలీసులమని చెప్పి మీ కొడుకుపై కేసు ఉందని, మా ఆధీనంలో ఉన్నాడని మీరు డబ్బులు మాకు పంపితే మీ కొడుకును వదిలేస్తామని సైబర్ నేరగాళ్లు బెదిరించడంతో ఆ వ్యక్తి 95వేల రూపాయలు ఫోన్‌పే ద్వారా పంపించాడని ఎస్సై తెలిపారు. అతని కొడుకుకు ఫోన్ చేయగా నేను బాగానే ఉన్నాని చెప్పడంతో తాను మోసపోయినట్లు తెలుసుకొని జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం'

సిరికొండ, జూలై 30: ఏక కాలంలో రెండు లక్షల రైతుల పంట రుణాల మాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్‌కు బీజేపీ నాయకులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నాయకులు నక్కరాజేశ్వర్, నాగులపల్లి రాజేశ్వర్, రామస్వామి మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న పంట రుణాల మాఫీచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. మండలంలోని తూంపల్లి, సిరికొండ సహకార సంఘాలలో రుణాలు తీసుకున్న రైతుల జాబితాను ఆన్‌లైన్ చేయడంలో రెండు సహకార సంఘాల సిబ్బంది చేసిన నిర్లక్ష్యం వల్ల మాఫీ కాకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాబురావు, గంగామురళి, రంజిత్‌రెడ్డి, పాల్గొన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,100	రూ.66,500	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.15, 1.15)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.15, 7.15, 10.15)
స్క్రీన్-2 : కల్కి(3డీ తెలుగు) (11.20, 6.15)
: రాయాన్ (3.05, 10.00)
స్క్రీన్-3 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.00, 4.15, 10.30)
: పురుషోత్తముడు (1.05) : ఆపరేషన్ రావన్ (7.20)
స్క్రీన్-4 : రామ్ ఎన్ఆర్ఐ (10.10) : గల్లీ గ్యాంగ్ స్టార్స్ (1.00)
: ట్విస్టర్స్ (ఇంగ్లీష్) (4.20) : రాయన్ (7.10)
: పురుషోత్తముడు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : రాయన్ (10.45, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (11.00, 1.40, 7.30)
: కల్కి (తెలుగు) (4.15, 10.20)
స్క్రీన్-3 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.40)
: కల్కి (1.20, 7.20)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.45)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : డెడ్‌పూల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్